
కూసుమంచిలో దివ్యాంగులు

- జిల్లావ్యాప్తంగా 1.91 లక్షల మందికి పింఛన్లు
- 28,831 మంది దివ్యాంగులకు పెరిగిన పెన్షన్లు
- సీఎం కేసీఆర్ వచ్చాకే పింఛన్ పంపిణీ విధానంలో మార్పులు
- వృద్ధాప్య, వితంతు, ఒంటరి మహిళలకు చేదోడుగా నిలుస్తున్న పథకం

### జిల్లాలో పింఛన్‌దారులు

| పెన్షన్ రకం | పింఛన్‌దారులు | నెలనెలా జమఅవుతున్న సొమ్ము |
|---|---|---|
| వృద్ధాప్యం | 74,092 | రూ.14.93 కోట్లు |
| వితంతువులు | 72,113 | రూ.14.53 కోట్లు |
| దివ్యాంగులు | 28,831 | రూ.11.57 కోట్లు |
| గీత కార్మికులు | 3,286 | రూ.66.34 లక్షలు |
| చేనేత కార్మికులు | 453 | రూ.9.13 లక్షలు |
| బోదకాలు బాధితులు | 1,406 | రూ.28.35 లక్షలు |
| హెచ్‌ఐవీ బాధితులు | 2,668 | రూ.53.79 లక్షలు |
| డయాలసిస్ బాధితులు | 144 | రూ.2.89 లక్షలు |
| బీడీ కార్మికులు | 2 | రూ.4 వేలు |
| ఒంటరి మహిళలు | 8,553 | రూ.1.72 కోట్లు |

కూసుమంచి, డిసెంబర్ 1: ఉమ్మడి పాలనలో అప్పటికీ పింఛను పొందుతున్న వారు మృతిచెందితే తప్ప కొత్తవారికి పింఛను అందేది కాదు. ఆ పింఛను సాధించడానికి కూడా సిఫార్సులు, గంటల కొద్దీ నాయకుల ఇళ్ల ఎదుట పడిగాపులు.. అంత కష్టపడీ పింఛను సాధిస్తే అందేది కేవలం రూ.వందల్లోనే.. అందిన అరకొర పింఛను చాలక వితంతువులు, దివ్యాంగులు, వృద్ధులు చేతిలో ఉన్న ఆ కాస్త సొమ్ముతో సరైన వైద్యం చేయించుకోలేక, మెడిసిన్ కొనుక్కోలేక ఇబ్బందిపడేవారు. ఇక గీత కార్మికులు, బోదకాలు, డయాలసిస్, హెచ్‌ఐవీ బాధితుల సంగతి సరేసరి. వారి బాధలు పట్టించుకునే నాథుడే ఉండేవారు కాదు. తెలంగాణ వచ్చిన తర్వాతే సీఎం కేసీఆర్ పింఛన్ పంపిణీ విధానంలో సమూలమైన మార్పులు తీసుకొచ్చారు. వందల్లో అందే పింఛనును వేలాల్లోకి తీసుకొచ్చారు.

# ఆదుకుంటున్నది ఆసరానే !

### పెన్షనే ఆధారం..

మాది పేద కుటుంబం. నాకు చిన్నతనంలోనే పోలియో వచ్చింది నాన్న గతంలోనే చనిపోయాడు. నాకు ఆసరా పెన్షనే ఆధారం. నేను అనాథాశ్రమంలో ఉంటున్నా. నాలాంటి అనేక మందికి పెన్షన్ ఆధారమైంది. దివ్యాంగులకు నెలకు రూ.4,016 పింఛను అందుతున్నది. మళ్లీ కేసీఆర్ సీఎం అయితే పింఛను పెరుగుతుంది. కేసీఆరే సీఎం కావాలని కోరుకుంటున్నా.

**– రమేశ్, దివ్యాంగ పింఛనుదారు, చౌటపల్లి, కూసుమంచి మండలం**



### పింఛను పెంపు..

తెలంగాణ సిద్ధించిన తర్వాత పింఛను పంపిణీ పథకానికి సీఎం కేసీఆర్ 'ఆసరా' అని నామకరణం చేశారు. ఉమ్మడి పాలనలో కేవలం రూ.200 ఉన్న వృద్ధులు, వితంతవుల పింఛనును ఏకంగా రూ.వెయ్యిగా ప్రకటించారు. అలాగే దివ్యాంగుల పింఛనును రూ.500 నుంచి రూ.1,500 పెంచారు. 2018 ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు ముఖ్యమంత్రి కేసీఆర్ వృద్ధులు, వితంతువుల పింఛనును రూ.1,000 నుంచి రూ.2,016కు, దివ్యాంగుల పింఛనును రూ.1,500 నుంచి రూ.3,016కు పెంచారు. 2020 మార్చిలో సీఎం కేసీఆర్ పింఛను అర్హత వయస్సును 65 ఏళ్ల నుంచి 57 ఏళ్లకు కుదించారు. 2023 జనవరిలో పింఛను తీసుకుంటున్న భర్త చనిపోతే అతని భార్యకు వెంటనే పింఛను వర్తింపజేయాలని సీఎం ఉత్తర్వులు జారీ చేశారు. ఖమ్మం జిల్లావ్యాప్తంగా ప్రస్తుతం 1.91 లక్షల మంది వృద్ధులు, దివ్యాంగులు, ఒంటరి మహిళలు, వితంతువులు, డయాలసిస్, బోదకాలు, హెచ్‌ఐవీ బాధితులు, గీతకార్మికుల ఖాతాల్లో నెలనెలా రూ.44.29 కోట్లు జమ అవుతున్నాయి. వీరిలో దివ్యాంగులు 28,831 మంది ఉన్నారు. అత్యధికంగా ఖమ్మం రూరల్ మండలంలో 11,431 మంది, అతి తక్కువగా మధిర మున్సిపాలిటీలో 3,003 మంది పెన్షన్ తీసుకుంటున్నారు.

### పెన్షన్ కొండంత అండ..

మాది పాలేరు. నేను పుట్టకతోనే దివ్యాంగుడిని. నాన్న గతంలోనే చనిపోయాడు. అమ్మ కూలీ. అమ్మ పనికిపోతేనే మాకు పూట గడుస్తుంది. ఇలాంటి పేదరికంలో నాకు నెల నెలా వచ్చే పింఛనే కొండంత అండ. నా అవసరాలు పింఛనుతోనే తీరుతున్నాయి.

**– వెంకన్న, దివ్యాంగ పింఛనుదారు, పాలేరు**







### కేసీఆర్ మా పెద్ద కొడుకు..

సీఎం కేసీఆర్ పెద్ద కొడుకులా వృద్ధులకు పింఛను అందిస్తున్నరు. నా లాంటి ఎంతో మంది వృద్ధులకు పింఛనే ఆసరా. ఎవరి మీదా ఆధారపడకుండా మందులు కొనుక్కుంటున్నా. చిన్న చిన్న అవసరాలు తీర్చుకుంటున్నా. కేసీఆర్ వంటి మంచి నేత మళ్లీ సీఎం అయితే ఇంకా ఎన్నో మంచి పథకాలు వస్తాయి. నిరుపేదలకు మేలు జరుగుతుంది.

**– సూరయ్య, వృద్ధాప్య పింఛనుదారు, అగ్రహారం, కూసుమంచి మండలం**

### కేసీఆరే మాకు పెద్ద దిక్కు..

నేను ఏళ్ల నుంచి బోదకాలు వ్యాధితో బాధపడుతున్నా. నాలాంటి వారెందరో ఈ వ్యాధితో బాధపడుతున్నారు. మా బాధలు వర్ణనాతీతం. నెలలో వారం రోజులు జ్వరంతో పాటు ఇతర సమస్యలతో సతమతమవుతుంటాం. గతంలో ఏ ప్రభుత్వమూ మా బాధలు పట్టించుకోలేదు. సీఎం కేసీఆర్ గోడు చూసి పింఛను మంజూరు చేస్తున్నారు. పింఛను మాకెంతో ఆసరా.

**– కనకం లచ్చయ్య, బోదకాలు బాధితుడు, కూసుమంచి**



### తెలంగాణ వచ్చినంకనే పింఛను పెంపు..

నా భర్త ఆరేళ్ల క్రితం అనారోగ్యంతో మరణించాడు. అప్పటి నుంచి కూలి పని చేసుకుంటూ బతుకుతున్నా. కేసీఆర్ సర్కారు నన్ను ఆసరా పథకానికి అర్హురాలిగా గుర్తించింది. నెల నెలా రూ.2,016 పింఛను ఇస్తున్నది. మాలాంటి వారెందరో జీవితాలను ఆసరా నిలబెడుతున్నది. గతంలో పింఛను తక్కువగా ఉండేది. తెలంగాణ వచ్చినంకనే పింఛను పెరిగింది.

**– చావా రేవతి, వితంతు పింఛనుదారు, కూసుమంచి**





# జోరుగా దూదిపంట విక్రయాలు

- సీసీఐ ద్వారా కొనుగోళ్లు ప్రారంభించిన అధికారులు
- భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో నాలుగు చోట్ల కేంద్రాలు
- 1,22,224 మెట్రిక్ టన్నుల పత్తి దిగుబడి అంచనా
- జిల్లాలో 2,00,525 ఎకరాల్లో పత్తి పంట సాగు

భద్రాద్రి కొత్తగూడెం, డిసెంబర్ 1 (నమస్తే తెలంగాణ) : జిల్లాలో పత్తి కొనుగోళ్లు ప్రారంభమయ్యాయి. ఒకవైపు ఎన్నికల బిజీ ఉన్నా రైతులు మాత్రం చేతికి వచ్చిన పత్తి పంటను తీసి విక్రయిస్తున్నారు. నిరుడు పత్తి పంటపై లాభాలు ఆర్జించిన రైతులు ఈ ఏడాది కూడా సాగును గణనీయంగా పెంచారు. లక్ష్యానికి మించి పత్తిని వేశారు. ఈ ప్రాంతాల్లో నాణ్యమైన పత్తి దిగుబడి వస్తుండడంతో పత్తికి మంచి డిమాండ్ పలుకుతోంది. దీంతో రైతులు కూడా ఈ పత్తిపైనా కోటి ఆశలు పెట్టుకున్నారు. జిల్లాలో 2,00,525 ఎకరాల్లో పత్తిపంటను సాగు చేసి విక్రయాలకు సిద్ధమవుతున్నారు. ఈ ఏడాది అధిక వర్షాలు కురవడంతో పంటల సాగుకు వాతావరణం అనుకూలమైంది. దీంతో అన్ని పంటలకు నీరు పుష్కలంగా అందుతోంది. వరి, పత్తి పంటలను ఈ ఏడాది అధిక విస్తీర్ణంలో సాగు చేయడంతో దిగుబడులు కూడా అదే స్థాయిలో వచ్చే అవకాశాలున్నాయి. ఇప్పటికే 15 రోజుల నుంచి పత్తి రైతులు కూలీల ద్వారా పత్తిని తీయించి విక్రయాలు చేస్తున్నారు.

### 1,22,224 మెట్రిక్ టన్నుల పత్తి..

జిల్లాలో 1,22,224 మెట్రిక్ టన్నుల పత్తి దిగుబడి వస్తుందని అధికారులు అంచనా వేశారు. 144 శాతానికి పైగా పత్తి పంటను రైతులు సాగు చేస్తున్నారు. అధికారులు సూచించిన లక్ష్యాన్ని దాటి పత్తి పంటను వేశారు. 1,39,598 ఎకరాల్లో పత్తిసాగు చేయాలని వ్యవసాయశాఖ నిర్ణయించగా అంతకు మించి 2,00,525 ఎకరాల్లో పంటను సాగుచేస్తున్నారు. నిరుడు కూడా పత్తిపంటకు డిమాండ్ ఉండడం, ఈ ఏడాది అదునుకు వర్షాలు కురవడంతో రైతులందరూ పత్తిపంటపైనే ఆశలు పెట్టుకున్నారు.

### నాలుగు చోట్ల కొనుగోళ్లు..

పత్తి పంట విక్రయాలకు రైతులకు ఎలాంటి లోటు లేకుండా అధికారులు కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నారు. జిల్లాలో నాలుగు సీసీఐ కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఇప్పటికే జిన్నింగ్ కాటన్ మిల్లులు వద్ద సంబంధిత యంత్రాంగాన్ని సిద్ధం చేయడంతో కొనుగోళ్లు ప్రారంభమయ్యాయి. సుజాతనగర్‌లోని మంజిత్ కాటన్ మిల్లు, కారేపల్లిలోని శ్రీలక్ష్మి కాటన్ మిల్లు, అశ్వాపురంలోని శ్రీరామ కాటన్ మిల్లు, లక్ష్మీపురంలోని అనుశ్రీ ఇండస్ట్రీస్‌లలో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి రైతులకు అందుబాటులో ఉంచారు. రైతులు విక్రయాలు జరుపుకునేందుకు పంటల వద్దనే తేమ శాతం తెలిపే యంత్రాలను కూడా అందుబాటులో



ఉంచాలని నిర్ణయించడంతో కేంద్రాల వద్ద ఆ పరికరాలను ఉంచారు. ఇందుకు సంబంధించిన పత్తి కూపన్లు కూడా ఇచ్చేశారు. పత్తిపంటకు ప్రభుత్వం రూ.7020గా మద్దతు ధరను కూడా ప్రకటించింది.

### పత్తి సాగుతో కూలీలకు ఉపాధి..

పత్తి సాగుతో రైతుల వద్ద కూలీలకు ఉపాధి లభిస్తోంది. సీసీఐ కొనుగోలు కేంద్రాలతోపాటు ప్రైవేటు కేంద్రాల్లో కూడా పత్తి విక్రయాలు జరుగుతుండడంతో రైతులు ప్రైవేటులో కూడా తమ పత్తి పంటను విక్రయిస్తున్నారు. దీంతో అటు పత్తి తీసే పనుల్లోనూ, ఇటు లోడింగ్ చేసే పనుల్లోనూ కూలీలకు ఉపాధి పెరిగింది. లోడింగ్‌లో ప్రతి రోజూ 200 మంది కూలీలు పనిచేస్తున్నారు.

### 4 కేంద్రాలను అందుబాటులో ఉంచాం..



ఈ ఏడాది రైతులు పత్తి పంట బాగా వేశారు. నిరుటి కంటే ఎక్కువగా సాగు చేస్తున్నారు. దీంతో అంచనాలకు మించి పత్తి సాగు అవుతున్నట్లయింది. పత్తి పంట కొనుగోలు కోసం సీసీఐ నాలుగు చోట్ల కేంద్రాలను అందుబాటులో ఉంచింది. దళారులను నమ్మి మోసపోవద్దు. ఆధార్ నెంబర్‌ను నమోదు చేసుకుని విక్రయానికి తీసుకురావాలి. ప్రభుత్వం రూ.7020 మద్దతు ధరను ప్రకటించింది. రైతులు వారి బ్యాంకు ఖాతాలను ఆధార్ లింక్ చేసుకొని ఉండాలి. ఇప్పటి వరకు 5,960 మెట్రిక్ టన్నుల పత్తిని సీసీఐ ద్వారా కొనుగోలు చేశాం.

**–అలీం, మార్కెటింగ్ శాఖ జిల్లా అధికారి**

# వణికిస్తున్న చలి

- జిల్లాలో గణనీయంగా పడిపోతున్న పగటి ఉష్ణోగ్రతలు
- ఉదయం 10 గంటలు దాటినా తగ్గని చలి తీవ్రత
- ఇళ్ల నుంచి బయటికి రావాలంటే జంకుతున్న జనం
- అవస్థలు పడుతున్న విద్యార్థులు, ఉద్యోగులు, కూలీలు
- రాత్రి 7 గంటలకే దుకాణాలు మూసేస్తున్న చిరు వ్యాపారులు

ఖమ్మం రూరల్, డిసెంబర్ 1 : చలి పులి జిల్లాపై పంజా విసురుతోంది. రోజురోజుకూ పడిపోతున్న ఉష్ణోగ్రతలతో ఉదయం, రాత్రివేళల్లో జనం రోడ్లపైకి రావాలంటేనే జంకుతున్నారు. ఉదయం పాఠశాలలు, కళాశాలలకు వెళ్లే విద్యార్థులు, ఉద్యోగులు, వివిధ పనుల నిమిత్తం వెళ్లే ప్రజలు, కూలీలు అవస్థలు పడుతున్నారు. వృద్ధులు, ఆస్తమా తదితర దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడే వారు ఇబ్బందులు పడుతున్నారు. కాగా.. మరో నెల రోజులపాటు చలి తీవ్రత ఇలాగే ఉంటుందని పర్యావరణ శాస్త్రవేత్తలు అంచనా వేస్తుండగా.. ఆరోగ్యం విషయంలో జాగ్రత్తలు పాటించాలని, శరీరానికి ఎండ తగిలే విధంగా ఉండాలని వైద్యులు సూచిస్తున్నారు. వాతావరణంలో సంభవించిన పెనుమార్పుల కారణంగా పదేళ్లలో ఎన్నడూ లేని విధంగా జిల్లా ప్రజలను చలి గజగజ వణికిస్తోంది. ఉదయం 10 గంటలైనా చలి ఏమాత్రం తగ్గడం లేదు. మధ్యాహ్నం 3 గంటల నుంచే మబ్బులతో చల్లని గాలులు వీస్తుండడం.. సాయంత్రం 6 గంటల నుంచే మంచు కురుస్తుండడంతో చలి తీవ్రత ఎక్కువవుతోంది.

### పడిపోయిన పగటి ఉష్ణోగ్రతలు..

వాతావరణంలో చోటుచేసుకున్న మార్పుల కారణంగా మునుపెన్నడూ లేని విధంగా ఈ ఏడాది పగటి ఉష్ణోగ్రతలు గణనీయంగా పడిపోయాయి. వారం రోజులుగా కనిష్ట ఉష్ణోగ్రతలు 20 నుంచి 22 డిగ్రీల సెల్సియస్ మధ్యలో నమోదవుతున్నాయి. దీనినిబట్టి జిల్లాలో చలి తీవ్రత ఏ స్థాయిలో ఉన్నదో అర్థం చేసుకోవచ్చు. ఇక పల్లెల్లో చలి తీవ్రత వల్ల చిన్నారులు, వృద్ధులు అనేక అవస్థలు పడుతున్నారు. ఇళ్ల వద్ద దుప్పట్లు కప్పుకొని చలి మంటలు కాగుతున్నారు. అంతేకాక ఖమ్మంతోపాటు ఇతర మున్సిపాలిటీల పరిధిలో వ్యాపార దుకాణాలు సైతం రాత్రి 8 గంటలకే మూతపడుతున్నాయి. చిరు వ్యాపారులు రాత్రి 7 గంటలకే వ్యాపారాన్ని ముగించుకొని ఇంటిబాట పడుతున్నారు.

### అవస్థలు పడుతున్న విద్యార్థులు, ఉద్యోగులు

భారీ వర్షాలు కురిసినా, పిడుగులు పడినా విద్యార్థులు పాఠశాలలకు, కళాశాలలకు, ఉద్యోగులు విధులకు హాజరు కావాల్సిందే. ప్రస్తుతం జిల్లాపై చలి పులి పంజా విసురుతుండడంతో ఉదయాన్నే పాఠశాలలకు వెళ్తున్న విద్యార్థులు, విధుల నిమిత్తం దూర ప్రాంతాలకు ప్రయాణం చేస్తున్న ఉద్యోగులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. రెక్కాడితే డొక్కాడని నిరుపేదలు సైతం ఉదయాన్నే పనులకు వెళ్లలేక సతమతమవుతున్నారు. చిరు వ్యాపారులు సూర్యుడు కనిపిస్తే తప్ప రోడ్లపైకి రావడం లేదు.



### పెరిగిన ఉన్ని దుస్తుల విక్రయాలు

ఇలాంటి పరిస్థితుల్లో చలి నేస్తాలుగా పేరున్న రక్షణ కవచాల(రగ్గులు, మఫ్లర్లు, స్వెటర్ల)కు గిరాకీ పెరిగింది. ఖమ్మం, సత్తుపల్లి, మధిర తదితర పట్టణాల్లో నేపాల్ తదితర ప్రాంతాల నుంచి వచ్చిన వ్యాపారులు ఉన్ని దుస్తుల విక్రయ కేంద్రాలను ఏర్పాటు చేసుకున్నారు. దీంతో ప్రజలు చలి నుంచి ఉపశమనం పొందేందుకు వాటివైపు పరుగులు పెడుతున్నారు. కొంచెం ఖరీదైనా ఏమాత్రం వెనుకాడకుండా కొనుగోలు చేస్తున్నారు.



